క్లుప్తంగా

వేడుకగా జెండా పండుగ


కోటలో ఆంజనేయస్వామి జెండా ఉత్సవం

కోట: కోటలో బుధవారం ఆంజనేయస్వామి భక్తబృందం ఆధ్వర్యంలో జెండా పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. దసరాకు ముందుగా జెండా పండుగను నిర్వహించుకోవడం గత ఏడాది ప్రారంభించారు. స్థానిక సోమేశ్వరాలయం నుంచి ఆంజనేయస్వామి జెండాను కోట పురవీధుల్లో ఊరేగించారు. జైశ్రీరాం నినాదాలు చేస్తూ భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం


పరిసరాలను శుభ్రపరుస్తున్న చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, కౌన్సిలర్లు

వెంకటగిరిరూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని ఈ మేరకు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్లతో కలసి పరిసరాలను శుభ్రపరిచారు. మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌రషీద్, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వీడ్కోలు సన్మానం

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి మున్సిపల్ కమిషనర్‌గా విధులు కొనసాగిస్తూ బదిలీపై రిలీవ్ అయిన అబ్దుల్‌రషీద్‌కు మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన వీడ్కోలు పలికారు. మున్సిపల్ చైర్పర్సన్ నక్కా భానుప్రియ, కౌన్సిలర్లు, కార్యాలయ అధికారులు, పారిశుధ్య కార్మికులు కార్యాలయంలో కమిషనర్ అబ్దుల్‌రషీద్‌ను సన్మానించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు.

త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలి


కుమ్మరిగుంటలో కాలనీని పరిశీలిస్తున్న పీడీ

రాపూరు: ప్రభుత్వం మంజూరు చేసిన లేఔట్లలో స్థలాలు మంజూరై గృహాలు నిర్మించుకోని లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని హౌసింగ్ పీడీ వేణుగోపాల్ పేర్కొన్నారు. కుమ్మరిగుంట గ్రామంలో లేఔట్‌లను ఆయన పరిశీలించారు. హౌసింగ్ ఏఈ రామకృష్ణ పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న నగలతోపాటు నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తడ: పలు ఇళ్లలో చోరీలకు పాల్పడిన కేసుల్లో నిందితుడిని బుధవారం తడ పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ చెంచుబాబు వివరాలు వెల్లడించారు. పార్వతీపురం మన్యం జిల్లా, గురుగుబిల్లి బీసీ కాలనీకి చెందిన చందక మణికంఠ శ్రీసిటీలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తూ తడలో నివాసం ఉంటున్నాడు. ఇటీవల స్థానిక సుజాతానగర్‌ని ఓ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. ఇదేవిధంగా శ్రీసిటీ, వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ చోరీ కేసులు నమోదై ఉన్నాయి. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు అనుమానంతో మణికంఠపై నిఘాపెట్టి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 106 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదించిన ఎస్‌ఐ కొండపనాయుడు, సిబ్బంది వెంకటేశ్వర్లు, నాగార్జున, నాగరాజు, సుబ్రమణ్యం, షేక్ సుహైల్, రాజేష్‌ను సీఐ మురళీకృష్ణ అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం


పారిశుధ్య కార్మికులకు సత్కారం

చిట్టమూరు (చిల్లకూరు): పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యమని చిట్టమూరు ఎంపీడీఓ షారోట్ తెలిపారు. చిట్టమూరులో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళి

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల వ్యాప్తంగా మహాత్మాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ చోట్ల గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అహింసాయుత పోరాటంతో దేశానికి స్వాతంత్య్రం సాధించారని, ఆయన బాటలో పయనించాలని పలువురు గాంధీజీ సేవలను కీర్తించారు. అలాగే గ్రామసభలు నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం మెరుగుపరిచారు.



విద్యానగర్‌లో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు


నాయుడుపేటలో గాంధీ విగ్రహం వద్ద నివాళి

నాయుడుపేటటౌన్: పట్టణంలోని గాంధీ పార్కులోని గాంధీజీ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ జలదంకి వెంకట కృష్ణారెడ్డి, కౌన్సిలర్‌లు, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పాలక వర్గ సభ్యులతో పాటు కమిషనర్ షేక్ ఫజులుల్లా గాంధిజీ చిత్రపటానికి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నేతలు బైనా మల్లికార్జున రెడ్డి, గంధవల్లి సిద్ధయ్య, కరింబాయి చెంచయ్య, దారారవి, చదలవాడ కుమార్, కాలగంధ సునీల్, పాపాడి చంద్రారెడ్డి, ఏ.బాబు, పాలేటి నాగార్జున, షేక్ రహ్మతుల్లా, షేక్ షబ్బీర్, కింగ్స్‌వే జిలాని పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ధనలక్ష్మి, మేనకూరులో జెడ్పీటీసీ కట్టా జ్యోతిరెడ్డి నివాళులర్పించారు.

బాలాయపల్లెలో

బాలాయపల్లి(సైదాపురం): జయంపు గ్రామంలోని గాంధీ విగ్రహానికి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. అదేవిధంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రపరచి, పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఎంపీడీఓ వినిల్, ఎంపీటీసీ సభ్యురాలు సుజాత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తడలో..

తడ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహానికి ఎంపీపీ కె.రఘురెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కార్యాలయ సిబ్బంది శ్రమదానంతో కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో భాగంగా ఇటీవల విజయవాడ వరదల్లో సాయం చేసేందుకు తడ నుంచి వెళ్లి సేవలు అందించిన వారితోపాటు మండలంలోని సఫాయి కర్మచారులను సన్మానించారు.

ఓజిలిలో

ఓజిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రజనీకాంత్, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ పద్మావతి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డీవీ సత్రంలో

దొరవారిసత్రం: స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ, ఏఈఓ కార్యాలయాల్లో ఆయా శాఖ అధికారులు, సిబ్బంది గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీఓ రఘురామయ్య పాల్గొన్నారు.

సైదాపురంలో

సైదాపురం: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ పాల్గొన్నారు.

విద్యానగర్‌లో స్వచ్ఛతా హీ సేవ

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ఎన్‌సీసీ క్యాడెట్లు బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛతా హీ సేవ నిర్వహించి ర్యాలీ చేశారు. మహాత్మునికి నివాళులర్పించారు. అనంతరం వీధులను శుభ్రపరిచారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్లు గోవిందయ్య, మల్లికార్జున్‌రెడ్డి, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

రాపూరులో

రాపూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

సూళ్లూరుపేటలో

ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, బీజేపీ, కాంగ్రెస్, ఆర్యవైశ్య సంఘాల నేతలు బస్టాండ్ సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వాకాడులో..

వాకాడు: స్థానిక తహసీల్దార్ కార్యాయం, ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ రామయ్య, ఎంపీడీఓ మనోహర్‌గౌడ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు సిబ్బందితో కలసి పరిసరాలను శుభ్రంచేసి పారిశుధ్య కార్మికులను సత్కరించారు.


జయంపు గ్రామంలో..


షార్‌లో డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ నివాళి

సూళ్లూరుపేట: సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ డైరెక్టర్ కార్యాలయంలో డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, గోపీకృష్ణ పాల్గొన్నారు.

వెంకటగిరిలో

వెంకటగిరిరూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌రషీద్, వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, విప్ పి.లక్ష్మి, కౌన్సిలర్లు ఆరిశంకరయ్య, నారాయణ, శ్రీనివాసులు, ధనియాల రాధ, కందాటి కల్యాణి పాల్గొన్నారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి, ఎంపీడీఓ కోటేశ్వరరావు, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఏపీఓ దీప నివాళులర్పించారు. అదేవిధంగా స్థానిక సీహెచ్‌సీ ప్రభుత్వ వైద్యశాలలో రోటరీక్లబ్, ఇన్నర్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో వైద్యశాలలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. రోటరీక్లబ్ ప్రెసిడెంట్ సుధాకర్, బీకేప్రసాద్, చంగల్‌రాయల్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

డక్కిలిలో..

డక్కిలి: మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి, కార్యాలయ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం గ్రామాల్లో పలువురు గ్రీన్ అంబాసిడర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ గోను రాజశేఖర్, ఎంపీడీఓ టి.ప్రసన్నకుమారి, సూపరింటెండెంట్ అనురాధ పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: మండల రెవెన్యూ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి తహసీల్దార్ శ్రీనివాసులు నివాళులర్పించారు. అలాగే పారిచెర్లవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారతీయ శిక్షణ మండలి ఆధ్వర్యంలో గాంధీ, లాల్ బహుదూర్‌శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం బండ్ల సుధాకర్, ఉపాధ్యాయులు, ప్రజేంద్రరెడ్డి పాల్గొన్నారు.


వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయంలో నివాళి


మేనకూరులో..


తడలో సన్మానం


వెంకటగిరి మున్సిపల్ కార్యాలయంలో నివాళి


డక్కిలిలో..


చిల్లకూరులో..


రాపూరులో నివాళి


డీవీసత్రం తహసీల్దార్ కార్యాలయంలో నివాళి

వంద మీటర్లలోపు ఉండకూడదు

వెంకటగిరి(సైదాపురం): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్యం ప్రైవేటీ కరణ పాలసీలో గుడి, బడికి వంద మీటర్లలోపు మద్యం దుకాణాలు ఉండకూడదని వెంకటగిరి ఎక్సైజ్ సీఐ సూర్యనారాయణ వెల్లడించారు. పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూతనంగా అమల్లోకి రానున్న మద్యం పాలసీ దుకాణాలకు సంబంధించి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానాలతో దరఖాస్తులను స్వీకరించనున్నామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రూ. 2లక్షలు డిపాజిట్ చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 11న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మద్యం దుకాణాలకు సంబంధించి లాటరీ ద్వారా డ్రా తీయనున్నట్లు వెల్లడించారు.


ఎక్సైజ్ సీఐ సూర్యనారాయణ

శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

గూడూరురూరల్: పట్టణం పటేల్ వీధిలోని సాయి సత్సంగ నిలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు. ఈక్రమంలో సాయి సత్సంగ నిలయానికి చెందిన కోట సునీల్ స్వామి బుధవారం కలశంతో నీరు తీసుకొచ్చి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా గూడూరు గ్రామ దేవత తాళ్లమ్మ ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలకు చెందిన అనుజ్ఞ కోసం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలోని బావి నుంచి కలశాలతో నీరు తీసుకొచ్చి సాయి సత్సంగ నిలయం వరకు మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం నిలయంలో ప్రత్యేక పూజలు చేసి దేవి విగ్రహానికి అభిషేకం చేశారు.


కలశాలతో నీరు తీసుకొస్తున్న సునీల్‌స్వామి

శరన్నవరాత్రి ఉత్సవాలకు పెంచలకోన సిద్ధం

రాపూరు: పెంచలకోనలో స్వయంభుగా వెలసిన ఆదిలక్ష్మీదేవికి గురువారం నుంచి 12వ తేదీ వరకు జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. స్వామి, అమ్మవారి ఆలయాల ప్రాంగణంలో విద్యుత్ దీపాలంకరణ, స్వామి, అమ్మవార్ల ఆర్చిలు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో జరిగే ఉత్సవాలకు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.


పెంచలకోనలో విద్యుద్దీపాలంకరణ

కండలేరులో 24.381టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం 24.381 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9,650 క్యూసెక్కుల నీరు చేరుతుందని ఆయన అన్నారు. అలాగే సత్యసాయిగంగ కాలువకు 1,400, పిన్నేరు కాలువకు 40, లోలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరిస్తే ఊరుకోం

గూడూరురూరల్: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరిస్తే ఊరుకునేది లేదని సీపీఎం, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. గూడూరు టవర్ క్లాక్ ప్రాంతంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ముందుగా నిరసన కార్యక్రమం చేపట్టి రోడ్డుకు ఇరువైపులా వాహన రాకపోకలను అడ్డుకున్నారు. నేతలు మాట్లాడుతూ ప్రైవేటీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొగ్గు చూపితే అన్ని వర్గాల ప్రజలు మూకుమ్మడిగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నేతలు జోగి శివకుమార్, బీవీ రమణయ్య, ఆర్.శ్రీనివాసులు, పుట్టా శంకరయ్య, అడపాల ప్రసాద్, శ్రీనివాసులు, ఎస్.సురేష్, చంద్రయ్య, మధు, రామిరెడ్డి, గుర్రం రమణయ్య, సీపీఐ నేతలు సీహెచ్ ప్రభాకర్, శశికుమార్, కాలేషా, ఎంబేటి చంద్రయ్య పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న నేతలు

ఆర్థికసాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న సభ్యులు

సూళ్లూరుపేట రూరల్: మన్నారుపోలూరు ప్రాంతానికి చెందిన హేమలలిత సాయిశ్రీ ఇంటర్ చదువుతోంది. లివర్ వ్యాధితో బాధపడుతున్న ఈమెకు పట్టణానికి చెందిన మేమున్నాం సేవా సంస్థ ద్వారా రూ.40వేల ఆర్థికసాయాన్ని తల్లిదండ్రులకు బుధవారం అందజేశారు. కమిటీ సభ్యులు ఉస్మాన్ బాషా, సురేష్, భారతి, కృష్ణారెడ్డి, సాయిరాం, భానుప్రకాష్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఇద్దరికి గాయాలు

గూడూరురూరల్: గూడూరు రెండవ పట్టణంలోని ఎస్‌కే ఆర్ కళాశాల ప్రాంతంలో వేగంగా వెళుతున్న బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోకి దూసుకెళ్లడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌కేఆర్ ప్రాంతానికి చెందిన ఇద్దరు పాలిటెక్నిక్ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు పట్టణంలో జరిగే జెండా ఉత్సవంలో పాల్గొనేందుకు బైక్‌లో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. అదృష్టవశాత్తు ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయ. స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఇద్దరు చికిత్స పొందుతున్నారు.

షార్‌లో స్వచ్ఛభారత్ దివస్


రోడ్లను శుభ్రం చేస్తున్న షార్ డైరెక్టర్

సూళ్లూరుపేట: సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లో గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛభారత్ దివస్-2024 కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం షార్ కేంద్రంలోని రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం షార్‌లో పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ వర్కర్స్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు

దొరవారిసత్రం: నెలబల్లి సమీపంలో బుధవారం లారీ ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. సైదాపురం ప్రాంతానికి చెందిన అన్నాచెల్లెలు వర్ధన్, మౌనిక బైక్‌పై సూళ్లూరుపేటకు వెళుతుండగా వెనుక నుంచి లారీ ఢీకొంది. క్షతగాత్రులకు స్థానికులే ప్రథమ చికిత్సలందించారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు వెల్లడించారు.

ఆరూరు విద్యార్థినుల ప్రతిభ

చిట్టమూరు (చిల్లకూరు): చిట్టమూరు మండలం ఆరూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ముగ్గురు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు బుధవారం తెలిపారు. ఆరూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు అండర్-14లో త్రోబాల్ క్రీడలో 9వ తరగతి విద్యార్థినులు ఎం.చరిత, బి.పూజిత మంచి ప్రతిభ కనబరిచారని దీంతో వారు జిల్లా స్థాయి పోటీల నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే అండర్-17 విభాగంలో త్రోబాల్‌లో జిల్లా స్థాయి పోటీల్లో ఏ.రూప మంచి ప్రతిభ చూపడంతో ఆమె కూడా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.


విద్యార్థినులతో వ్యాయామోపాధ్యాయుడు



సైదాపురంలో కురుస్తున్న వర్షం

సైదాపురంలో మోస్తరు వర్షం

సైదాపురం: మండలంలో కొద్దిరోజుల నుంచి కాస్తున్న ఎండకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈక్రమంలో బుధవారం మధ్యాహ్నం నుంచి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. దీంతో నిమ్మ, మామిడి రైతులకు కొంత ఊరట లభించింది.

స్వచ్ఛతా హీ సేవపై ప్రత్యేక దృష్టి

నాయుడుపేటటౌన్: స్వచ్ఛతా హీ సేవపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా మేనకూరులో బుధవారం ఎంపీడీఓ భువనేశ్వరశర్మ సారథ్యంలో జెడ్పీటీసీ కట్టా జ్యోతిరెడ్డి, సర్పంచ్ సురేష్, కూటమి నాయకులతో కలసి కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. సంపద తయారీ కేంద్రం వద్ద పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించి దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సన్నారెడ్డి చంద్రారెడ్డి దాతృత్వంతో నోటు పుస్తకాలను వితరణగా అందజేశారు. గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

దరఖాస్తులకు ఆహ్వానం

గూడూరురూరల్: గూడూరు, చిల్లకూరు మండలాలలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ కరీమాబేగం తెలిపారు. గూడూరు రెండవ పట్టణంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ దరఖాస్తును ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఈనెల 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. దరఖాస్తులను ఈనెల 11న లాటరీ ద్వారా ఎంపిక చేస్తారన్నారు.